# ఎన్నికలకు పోలీసులు సిద్ధంగా ఉండాలి

- ముందస్తు సమాచారాన్ని సేకరించి, అంకితభావంతో విధులు నిర్వర్తించాలి
- సమష్టిగా విధులు నిర్వహించినప్పుడు ఏదైనా సాధించవచ్చు
- రాజన్న సిరిసిల జోన్ డీఐజీ రమేశ్‌నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ రమేశ్‌నాయుడు, పక్కన ఎస్పీ రోహిణిప్రియదర్శిని

మెదక్‌అర్బన్, అక్టోబర్ 3: ఎన్నికల నిర్వహణలో సూక్ష్మస్థాయిలో ప్రణాళికలు తయారు చేయాల్సి ఉంటుందని రాజన్న సిరిసిల్ల జోన్ డీఐజీ రమేశ్ నాయుడు అన్నారు. మంగళవారం మెదక్ జిల్లా నూతన పోలీస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిణిప్రియదర్శిని డీఐజీకి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం డీఐజీ పోలీస్ గౌరవవందనం స్వీకరించి పోలీస్ కార్యాలయంలో ఉన్న వివిధ విభాగాలను సందర్శించి జిల్లాలో నమోదవుతున్న కేసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఐజీ రమేశ్‌నాయుడు మాట్లాడుతూ తెలంగాణలో రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల బందోబస్తుకు సంబంధించి పోలీస్ అధికారులందరూ సంసిద్ధంగా ఉంటూ, ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సూచించారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, ప్రాంతాల గుర్తింపు పట్ల స్పష్టతతో ఉండాలన్నారు. ఓటరుజాబితా, ఎన్నికల సంఘం స్వేచ్ఛగా, నిష్పాక్షపాతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు అభ్యర్థులకు జారీ చేసిన మార్గదర్శకాల సముదాయం మోడల్ ప్రవర్తనానియమావళి, ఎన్నికల తేదీలు ప్రకటించిన రోజు నుంచి ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు పాటించాల్సించిన అంశాలను వివరించారు. ఎన్నికల నిర్వహణలో పోలీసుల పాత్ర, భద్రతాదళాల మోహరింపు, నామినేషన్ దాఖ లు నుంచి ప్రచారపర్వం, పోలింగ్ రోజు నిర్వహణ తదితర అంశాలపై చేపట్టే ప్రణాళికలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎన్నికల సమావేశాలు, ప్రసంగాలు, నినాదాలు, పోస్టర్లు మొదలైన వాటికి సంబంధించిన మార్గదర్శకాలను పోలీసు అధికారులకు తెలియజేశారు. ప్రచార వ్యవధి నియంత్రణ, మోడల్ ప్రవర్తనా నియమావళి చట్టం, మొడల్ ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనను భారతీయ శిక్షాస్మృతి, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 వంటి వివిధ చట్టాల అమలు సమస్యలు సృష్టిం చే వ్యక్తుల బైండోవర్ గురించి సిబ్బందికి వివరించారు. ఎన్నికలకు సంబంధింతి ప్రతివిషయంలోనూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, మెదక్ డీఎస్పీ ఫణీంద్ర, తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# సర్వేయర్‌కు అబ్దుల్ కలాం అవార్డు

చిలిపిచెడ్, అక్టోబర్ 3: మండల సర్వేయర్‌గా పనిచేస్తున్న డాక్టర్ గంటంబొట్ల రవిప్రసాద్ శర్మకు ఏపీజే అబ్దుల్ కలాం అవార్డును ప్రదానం చేశారు. ఆయన 16 ఏండ్ల నుంచి వివిధ సామాజిక స్వచ్ఛంద సంస్థల్లో చేస్తున్న సేవలను గుర్తించి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్జీవో, స్ఫూర్తి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వతా పరిషత్ కార్యాలయంలో ఎన్జీవో ఫౌండర్, చైర్మన్ డాక్టర్ ఆకుల రమేశ్ ఏపీజే అబ్దుల్ కలాం అవార్డును ప్రదానం చేశారు. మంగళవారం మండలకేంద్రమైన చిలిపిచెడ్‌లో విలేకరులతో రవిప్రసాద్ శర్మ మాట్లాడుతూ వివిధ సామాజిక స్వచ్ఛంద సంస్థల్లో సేవా కార్యక్రమాలు చేసినందుకు అవార్డు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉన్నదన్నారు. ఈ అవార్డు రావడంపై ఎంప్లాయిస్, వివిధ సామాజిక సంస్థల కమిటీ సభ్యులు, పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులతోపాటు తన స్వగ్రామం వెల్మకన్న గ్రామ ప్రజలు, పురోహితులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు అభినందించారని చెప్పారు.




ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు అందుకుంటున్న చిలిపిచెడ్ రెవెన్యూ సర్వేయర్ రవిప్రసాద్ శర్మ

## బదిలీ షెడ్యూల్ ప్రారంభం

మెదక్ అర్బన్/ సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 3: మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ప్రభుత్వ, లోకల్‌బాడే పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఎస్జీటీ, తత్సమాన కేటగిరి ఉపాధ్యాయుల బదిలీ షెడ్యూల్ ఈనెల 3,4తేదీల్లో స్పౌజ్ పాయింట్లను తొలగించటం లేదా జీవిత భాగస్వామి పాయింట్లు, డీఎస్సీ ర్యాంకుల దిద్దుబాలు సంబంధించిన అప్పీళ్ల కోసం, ఖాళీలపై సవరణలు, ఫిర్యాదుల కోసం దరఖాస్తు వివరాలను అప్‌డేస్ చేయడానికి గ్రీవెన్స్ ద్వారా అప్పిల్ చేసుకోవాలని జిల్లాల విద్యాధికారులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 5వ తేదీన తుది సీనియార్టీ జాబితాలను ప్రదర్శిస్తామని చెప్పారు. ఆరు, ఏడు తేదీల్లో ఉపాధ్యాయులు వెబ్‌ఆప్షన్లను పెట్టుకోవడం, 8వ తేదీన వెబ్‌ఆప్షన్ల ఎడిట్ ఉంటుందన్నారు. వెబ్ ఆప్షన్స్ ఎంపికలు ప్రారంభమైన తర్వాత, ఖాళీలు, పాయింట్లు, జీవితభాగస్వామి పాయింట్లపై మార్పులు, సవరణలు ఉండవని పేర్కొన్నారు. ఎస్జీటీ, తత్సమాన కేటగిరీ ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పార్ట్‌టైమ్ బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ అర్బన్‌ష అక్టోబర్ 3: తెలంగాణ గిరిజన మహి ళా డిగ్రీ కళాశాలలో యూజీసీస్థాయిలో పార్ట్ టైమ్‌లో తెలుగు, కెమిస్ట్రీ, జువాలాజీ, కంప్యూటర్‌సైన్స్ సబెక్టుల్లో బోధించుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు కళాశాల ప్రిన్సిపాల్ వసంత మంగళవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పీజీ, నెట్, సెట్ అర్హత సాధించాలన్నారు. ఈనెల 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం 7901097706 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పెంపు

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 3: ఉమ్మడి జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో పదోతరగతి, ఇంటర్ 2023-24 సంవత్సరానికి ప్రవేశగడువును ఈనెల 13 వరకు నిర్ణీత అపరాధ రుసుముతో పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు మంగళవారం ప్రకటనలో తెలిపారు. పదోతరగతి ప్రవేశాలకు సంబంధించి ఓసీ పురుషులకు రూ.1400, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పురుషులు, మహిళలకు రూ.1000 రుసుముతోపాటు ప్రాస్పెక్టస్ ఖరీదు అందరికీ రూ.150, అపరాధ రుసుము రూ.100తో కలిపి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇంటర్మీడియట్ ప్రవేశాలకు సం బంధించి ఓసీ పురుషులకు రూ.1500, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పురుషులు, మహిళలకు రూ.1200 రుసుముతోపాటు ప్రాస్పెక్టస్ ఖరీదు అందరికీ రూ.300, అపరాధ రుసుము రూ.200తో కలిపి చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. అయితే నిర్ణీత ఫీజు కంటే ఎక్కువ వసూలు చేస్తే సంబంధిత అధ్యాయన కేంద్రాన్ని రద్దు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటా మని చెప్పారు. సంబంధిత మండల అధ్యయన కేంద్రంలో ప్రవేశం పొంది అభ్యాసకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రవేశ రుసుమును టీఎస్‌ఆన్ లైన్, మీ సేవ ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు. తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం వెబ్‌సైట్ (www.telanagana open scholl.org) ద్వారా మాత్రమే ప్రవేశ నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. వివరాలకు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ వెంకటస్వామి 8008403635 నంబరుపై సంప్రదించాలని డీఈవో సూచించారు.

# చట్టాలపై అవగాహన పెంచుకోవాలి




సిద్దిపేట రూరల్: అవగాహన కల్పిస్తున్న సిద్దిపేట రూరల్ సీఐ చేరాలు

సిద్దిపేట రూరల్, అక్టోబర్ 3: మహిళలకు, విద్యార్థులు, బాలికలకు ఉన్న రక్షణ చట్టాలను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని సిద్దిపేట రూరల్ సీఐ చేరాలు, సిద్దిపేట షీటీం సభ్యులు అవగాహన కల్పించారు. మంగళవారం ఇర్కోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రక్షణ చట్టాలను వివరించారు. సీఐ మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సీపీ ఆదేశాల మేరకు బాలికలు, మహిళలకు కల్పించిన రక్షణ చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై వివరించారు. బ్యాంకు, వ్యక్తిగత వివరాలు ఎవరికీ తెలియజేయరాదన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తు చేసుకొని చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. తెలిసీతెలియని వయస్సులో ప్రేమ, పెండ్లి అని జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలను వివరించారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులకు ఆపదవస్తే డయల్ 100, సిద్దిపేట షీటీం వాట్సాప్ నంబర్ 8712667434, స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ నంబర్ 9494639498, మహిళా పోలీస్‌స్టేషన్ నంబక్ 8712667435కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుమలత, ఉపాధ్యాయులు, సిద్దిపేట షీటీం సిబ్బంది, మహిళా కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# మైనంపల్లికి మద్దతివ్వం

- కంఠారెడ్డి బాటలో మరో ఇద్దరు మండల అధ్యక్షుల రాజీనామా
- అధిష్టానం ఇప్పటికైనా ఆలోచన చేసి కంఠారెడ్డికి టికెట్ ఇవ్వాలి
- లేకుంటే మూకుమ్మడి రాజీనామాలు చేస్తాం
- రామాయంపేటలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శామిరెడ్డి, లింగం గౌడ్

రామాయంపేట, అక్టోబర్ 3: కాంగ్రెస్ పార్టీలో చిచ్చు రగులుతున్నది. మెదక్ డీసీసీ అధ్యక్షుడిగా పదేండ్లపాటు కాంగ్రెస్‌లో పనిచేసిన నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డిని పక్కనపెట్టి వలస వచ్చిన నాయకులకు మెదక్ అసెంబ్లీ టికెట్ ఇవ్వడంపై తీవ్ర మానసిక వేదనతో జిల్లా అధ్యక్ష పదవికి, పార్టీ సభ్యత్వానికి కంఠారెడ్డి రాజీనామా చేశారు. మంగళవారం తిరుపతిరెడ్డి బాటలోనే రామాయంపేట, నిజాంపేట మండలాల అధ్యక్షులు లింగంగౌడ్, శామిరెడ్డి, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డితోపాటు ఇతర కమిటీల పదవులకు రెండు మండలాల కాగ్రెస్ పార్టీ నాయకులు రాజీనామా చేశారు. అనంతరం వారు రహస్య ప్రాంతం లో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. స్థానిక నాయకుడికి టికెట్ ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ మోసం చేయడం తగదని అధిష్టానంపై మండిపడ్డారు. కరోనా లాంటి కష్ట కాలంలో సైతం స్వంతంగా డబ్బులు పెట్టి మెదక్ నియోజకవర్గ ప్రజలకు సేవచేసింది కేవలం తిరుపతిరెడ్డి అన్నది కాంగ్రెస్ పెద్దలు నమ్మాలన్నారు. పదేండ్లుగా పార్టీకి సేవచేసిన తిరుపతిరెడ్డిని కాదని మైనంపల్లికి టికెట్ ఎలా ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. కంఠారెడ్డి బాటలోనే తాము నడుస్తామని త్వరలోనే ఆయన నిర్ణయానికి, కార్యాచరణకు జిల్లాలో ఉన్న నాయకులందరూ కట్టుబడి ఉంటామని చెప్పారు. మెదక్ నియోజకవర్గంలో కచ్చితంగా మైనంపల్లి రోహిత్‌కు డిపాజిట్ దక్కకుండా చేస్తామని శపథం చేశారు. రామాయంపేట, నిజాంపేట మండలాల్లో వ్యక్తిగతంగా తిరుపతిరెడ్డికి గట్టి పట్టుంది. ఎందుకంటే ఆయన స్వస్థలం నిజాంపేట మండలం కల్వకుంట గ్రామం. అందుకోసం కార్యకర్తలు సైతం ఆయనకు వెన్నుదన్నుగా ఉన్నారు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ ఇలాగే మొండి వైఖరి అవలంబిస్తే బీఆర్‌ఎస్ పార్టీలోకి వెళ్లడం ఖాయమని కాంగ్రెస్ నాయకులు భేషరతుగా అంటున్నారు. బీఆర్‌ఎస్ పార్టీలోకి వెళ్లి రోహిత్‌కు డిపాజిట్ గల్లంతు చేసేవరకు మరో ఉద్యమాన్ని చేపడుతామని మైనంపల్లిని హెచ్చరించారు. కంఠారెడ్డి బీఆర్‌ఎస్ పార్టీలోకి వస్తే ప్రస్తుతం ఉన్న మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఇప్పుడు 50వేల మెజార్టీ అనుకుంటే వచ్చే ఎన్నికల్లో లక్ష మెజార్టీతో విజయం సాధించడం ఖాయంలా కనిపిస్తున్నదని స్థానిక నేతలు చెవులు కొరుక్కుంటున్నారు. ఏదేమైనా బీఆర్‌ఎస్ పార్టీకి మంచి రోజులు వస్తున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. మెదక్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీకి కంచుకోటగా మారనుంది. ఎమ్మెల్యేగా ఉన్న పద్మాదేవేందర్‌రెడ్డి హ్యాట్రిక్ సాధించే అవకాశం మెండుగా కనిపిస్తున్నాయని కాంగ్రెస్ నాయకులే చెబుతున్నారు.



రామాయంపేటలో సమావేశమైన కాంగ్రెస్ పార్టీ నాయకులు